

# భవానీద్వీపం

**– వనం వేంకట వరప్రసాదరావు**



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 42 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

నూనూగు మీసాల వయసులోనే పరిపూర్ణ జ్ఞాని అయినాడు నాగుమయ్య. నిర్వికారంగా తండ్రికి అంత్యక్రియలు జరిపించాడు. శంకరశాస్తుర్లు గారి సాధన, బోధన, తపన వ్యర్థం కాలేదు. నాగుమయ్య సమస్త మంత్రశాస్త్ర ప్రవీణుడు అయినాడు. ప్రత్యేకించి నాగజాతికి అపర గరుత్మంతుడు అయినాడు. క్రమేపీ నాగవరప్పాడులో ప్రశాంతత నెలకొన్నది.

నాగుమయ్య అన్న ఆ తరువాత ఎవరికీ కనబడలేదు. కళ్ళు కనబడక ఏ నూతిలోనో, ఏ కొండమీంచో పడి చనిపోయి వుంటాడు అన్నారు కొందరు. దేశాలు పట్టిపోవడం శంకరశాస్తుర్లు గారి వంశంలో వున్నదే, నాగుమయ్య అన్నకూడా అలాగే పోయి వుంటాడు, ఎప్పుడో తనే తిరిగొస్తాడు అని తేల్చిపారేశారు కొందరు. అసలు పార్వతమ్మ కవలపిల్లలకు జన్మనిచ్చిన రోజే దేవతా సర్పాన్ని చంపేశాడు శంకరశాస్తుర్లుగారు. అదీగాక వందేళ్ళక్రితం కనబడకుండా వెళ్ళిపోయిన సదాశివశాస్తుర్లు గారు ఆ యింట్లో చావడానికే అన్నట్టు తిరిగి రావడం, చావడం ఏంటి కర్మ గాకుంటే? ఆ దోషమే కొట్టింది. పెద్దబాబు గారికి నాగశాపం కొట్టింది అని తీర్మానించారు కొందరు.

ప్రతి నాగులపంచమికీ పాండవులగుట్టమీద పెద్ద ఉత్సవాలు చేయించేవాడు నాగుమయ్య. పెద్ద గుండిగనిండా ఆవుపాలు తనే స్వయంగా పాండవులగుట్ట పైకి మోసేవాడు. అందరితో నాగ పూజలు చేయించి పంపించేవాడు. అపరాహ్ణము దాటిన తర్వాత ఎవరినీ కొండమీద ఉండనిచ్చేవాడు కాదు. తనొక్కడూ కొండమీద సాయంత్రము వరకూ గడిపి, చీకటిపడే సమయానికి కొండ దిగేవాడు. ఆవుపాలు అన్నీ అయిపోయేవి. వుట్టి గుండిగను తనే క్రిందకు మోసుకొచ్చేవాడు.

మరలా ముందటేడు నాగులపంచమి వరకూ కథలు కథలుగా చెప్పుకునేవాళ్ళు అందరూ. యిద్దరుమనుషులు లేపితేగానీ లేవని పెద్ద ఇత్తడి గుండిగ అది. కామధేనువుల్లాంటి వంద ఆవులను పితికితే ఆ గుండిగ నిండేది. దాన్ని ఒక్కడే భుజానికెత్తుకుని పాండవులగుట్టనెక్కేవాడు నాగుమయ్య!

ఆ పాలు నాగుమయ్యే తాగుతాడు, అందుకే దిష్టి తగలకుండా అందరినీ కొండమీదినుండి పంపించెయ్యడం అనేవాళ్ళు కొంతమంది. లేదు, లేదు, గుట్టమీది బిలంగుండా పాతాళంనుండి నాగరాజు వచ్చి పాలుతాగుతాడు. అది ఎవరైనా చూస్తే తలపగిలి చస్తారు, అందుకే నాగుమయ్య ఎవరినీ వుండనీయడు అని నమ్మకంగా చెప్పేవాళ్ళు కొందరు.

అంతా ప్రశాంతంగా ఉన్నది అనుకుంటుండగా పోయినేడు నాగులపంచమి సంబరాల దగ్గరినుండీ విచిత్రమైన కథ మొదలైంది నాగవరప్పాడులో. గ్రామకంసలి ఒక్కగానొక్క కూతురు సంపంగిని ఏదో దుష్టగ్రహం పట్టుకుంది. ఆ నాగులపంచమినాడు నాగులకు కొలుపులు, సంబరాలు ఐపోయాయి. సూర్యుడు నడినెత్తిమీదికి రాగానే ఎప్పట్లాగే అందరూ ఉరుకులు పరుగులమీద కొండ దిగారు. సంపంగి యింటిలో లేదు. తోటివాళ్ళతో ఆటలు పాటలకోసం వెళ్ళిందేమో, నెమ్మదిగా వస్తుందిలే అని చూశారు కొంతసేపు. ఎంతకూ సంపంగి యింటికి చేరుకోకపోవడంతో తండ్రి వీరభద్రాచారి కూతురును వెదకడానికి బయలుదేరాడు ఆందోళనగా.

పొద్దు గుంకబోతున్నది. కొంతసేపటికి నాగుమయ్య గుట్టదిగి వచ్చే సమయం అవుతుంది అనగా, యింటికి చేరుకుంది సంపంగి. రావడం కూడా ఎవరో వెంటబడి తరుముతుంటే ఆగకుండా పరుగెత్తుకొచ్చినట్లు రొప్పుకుంటూ వచ్చింది. కలవరపడిపోతూ, వణికిపోతున్నది. ఏమైంది అని తరచి తరచి అడిగితే కొండగోగు పూలకోసం సరదాగా గుట్టవెనుకవైపుకు లోయలోకి దిగి దారి కనుక్కోలేక పోయాను, భయమేసింది అని భోరుమన్నది. కానీ అది నిజంకాదు, ఏదో దాస్తున్నది అనిపించింది తండ్రికి. తరువాత కనుక్కుందామని అప్పటికి వదిలేశాడు తండ్రి.

ఆ రోజునుండీ విచిత్రంగా ప్రవర్తించడం మొదలెట్టింది సంపంగి. అర్ధరాత్రివేళ లేచి యింట్లోంచి వెళ్ళిపోవడానికి ప్రయత్నించేది. ఎవరో పిలుస్తున్నట్లు చటుక్కున నిద్రలోంచి లేచి కూర్చునేది. చూపు, ధ్యాస అంతా పాండవులగుట్టమీదే. మాట్లాడితే, పాండవులగుట్ట గురించే. అందరి కన్ను గప్పి, వేళాపాళా లేకుండా పాండవుల గుట్టమీదికి ఒక్కతే వెళ్తుంటే చూసినవాళ్ళు బలవంతంగా పట్టుకొచ్చి తండ్రికి అప్పజెప్పారు కొన్నిసార్లు.

ఇక అందరికీ, అన్నిటికీ పెద్దదిక్కు నాగుమయ్య రంగంలోకి దిగాడు. ఎప్పటినుండి అలా మొదలయ్యిందీ ఆరా తీశాడు. మంత్రించిన తాయెత్తు కట్టాడు. మైల సోకినప్పుడు తాయెత్తు పనిచేయకుండా పోతుంది అని చెప్పాడు. ప్రతినెలా రజస్వల స్నానం ఐన తర్వాత మరలా తాయెత్తు కట్టేవాడు. ఇలా కొంతకాలం నడిచింది. సంపంగి తీరు యింకా అధ్వాన్నంగా పరిణమించింది. చిత్రంగా ఆమెకు నాగుమయ్యమీద ద్వేషం పుట్టుకొచ్చింది! నాగుమయ్య ఎదుట పడడానికి నానా ప్రళయం చేసేది. చేతికి తాయెత్తు పడ్డతరువాత విచిత్రంగా శాంతించేది.

ఆ సమయంలో నాగుమయ్య ఓరుగల్లు కోటకు వెళ్లి వారం రోజులు బసచేసి ఉన్నాడు. ఓరుగల్లు ప్రభువుల ప్రత్యేక దూతలు వచ్చి, మేనాలో నాగుమయ్యను రాజ లాంఛనాలతో తీసుకెళ్తుంటే నాగవరప్పాడు పులకించిపోయింది. ఓరుగల్లు ప్రభువుల కుమార్తె అప్పుడు ఐదేళ్ళ బాలిక. ఆమెకు తీవ్రమైన చర్మవ్యాధి సోకింది. రాచవైద్యులకు ఆ వ్యాధి లొంగలేదు. ఒక విధమైన విషప్రయోగం వలన అలా జరిగిందని అభిప్రాయపడ్డారు రాచవైద్యులు. ఆనోటా ఈనోటా నాగుమయ్య ప్రసక్తిని విని దూతలతో ఆహ్వానాన్ని పంపారు ఓరుగల్లు ప్రభువులు.

రాకుమార్తె నాడి చూసీ చూడడంతోనే విషప్రభావం వలన జరిగింది అని చెప్పాడు నాగుమయ్య. అయితే అది రాజద్రోహుల విషప్రయోగం కాదు అని స్పష్టం చేశాడు. ఒకవిధమైన మిన్నాగు చిమ్మిన విషపు చిందులు పడిన కారణంగా ఆ వ్యాధి సోకింది అని చెప్పాడు. చెట్టునుండి చెట్టుకు ఎగురుతూ ఉంటుంది ఆ భయంకరమైన విషసర్పం అని చెప్పాడు. వింటున్న రాచవైద్యులు పరిహాసంగా నవ్వారు.

ప్రభువుల అనుమతితో ఆయన ఉద్యానవనంలోకి అందరినీ తీసుకుని వెళ్ళాడు నాగుమయ్య. మరగకాచిన నువ్వుల నూనెను శరీరము నిండా పట్టించుకున్నాడు. నైరుతిలో వున్న పెద్ద పున్నాగచెట్టు మీదకు తనే ఎక్కాడు.

అందరూ చూస్తుండగా చిటారుకొమ్మకు దూకి పోతున్న ఆ విషసర్పాన్ని పట్టుకున్నాడు. మణికట్టు లావున, మూడు మూరల పొడవున నల్లని పొడలతో భయంకరంగా వున్నది ఆ సర్పం. తెల్లని నురుగు చిందులలాగా విషాన్ని పాతిక గజాల దూరంవరకూ చిమ్ముతున్నది. దాన్ని చంపబోతున్న రాజభటులను వారించి, తనే స్వయంగా దాన్ని అడవిలోకి వదిలిపెట్టాడు నాగుమయ్య. రాకుమార్తెకు ఔషధాన్ని తయారుజేసి యిచ్చాడు. ప్రభువుల ఘన సత్కారాన్ని, కానుకలను అందుకని, పల్లకీలో ఆ సాయంత్రమే ఊరుకు చేరుకున్నాడు. ఆ తెల్లవారు ఝామున సంపంగి యింట్లో కనిపించకుండా పోయింది.

సంపంగి తండ్రి పరుగునవచ్చి విషయం చెప్పగానే అందరినీ సిద్ధం చేశాడు నాగుమయ్య. ఏం జరగాలో, ఎలా జరగాలో చెప్పాడు. పిరికివాళ్ళను, మానసికంగా బలహీనమైన వాళ్ళను రావద్దని ముందే చెప్పాడు. భయంకరమైన సంఘటనలు జరుగవచ్చు అని ముందే హెచ్చరించి అందరినీ సిద్ధపరిచాడు. కనులారా చూసినా నమ్మకం కలగని సంఘటనలమధ్య సంపంగిని రక్షించి నాగవరప్పాడు బాట పట్టాడు.

★★★★★★★★★★★★★★★★★★★★★★★★★

'శివయ్యా!' అన్న పిలుపుతో దశాబ్దాల జ్ఞాపకాలనుండి తేరుకున్నాడు ఆ వృద్ధుడు శివయ్య. గ్రామ పొలిమేరల్లోకి వచ్చినట్లు గమనించాడు. అప్పటిదాకా నాగుమయ్య పాట పాడుతున్న యువకుడు యింకా కూనిరాగాలు తీస్తూనే వున్నాడు. సంపంగిని తండ్రికి అప్పజెప్పి, యింటికి చేరినతర్వాత చేయాల్సిన పనుల గురించి హెచ్చరించాడు నాగుమయ్య. అందరినీ యిళ్ళకు పంపించివేశాడు. తనూ వెళ్ళబోయిన శివయ్యను వారించాడు.

' సగం కథ నీకు తెలిసిందే శివయ్యా!' అన్నాడు నాగుమయ్య ప్రశాంతంగా.

' నేనెంత వాడిని సామీ! నాకేం తెలుసు?' అన్నాడు శివయ్య. ' ఆరోజు ముసి ముసి చీకటిలో నాన్నగారు చివరి క్షణాలలో చెప్పిందంతా విన్నావుగా శివయ్యా!'

అన్న మాటలు పూర్తి కాకముందే నాగుమయ్య పాదాలమీద పడిపోయాడు శివయ్య.

' పెద్దబాబు ఎప్పుడొస్తాడో, తమరికీ పెద్దయ్యగారికీ ఏం కీడు జరుగుతుందో అని నేనూ, నా కొడుకులూ వంతులేసుకుని కనిపెట్టుకుని వున్నామయ్యా! అంతకు మించి ఏమీ లేదు' అన్నాడు శివయ్య.

' అన్నయ్య పాండవులగుట్టమీద బిలంలోకి చేరుకున్నాడు శివయ్యా! అప్పటినుండీ అక్కడే వున్నాడు! బయటకు రాకుండా కట్టు వేశాను. పేరుకే మనిషి! నాగమణి శరీరంలో పూర్తిగా కరిగిపోయి, మానవసర్పం అయినాడు శివయ్యా!! పున్నమి రోజులలో కామంతో దహించుకుపోయేవాడు. ఉన్నట్టుండి చనిపోయిన యువతులందరూ తను కామంతో కాటు వేసినవాళ్ళే!

ఒక్క క్షణం నిలువెల్లా కంపించిపోయాడు శివయ్య. నాగుమయ్య కొనసాగించాడు. ' తోడబుట్టినవాడు.. నాన్నగారికి మాట యిచ్చాను.. అందుకే ప్రతి నాగులపంచమికీ కొలుపులు చేసి, శాంతింపజేస్తున్నాను శివయ్యా! ఆ భయంకరమైన ఆదత్రాచుతో కాపురంవలన ఒక రకమైన పరిమళం వచ్చింది తనకు. రక్తంలో కలిసిపోయిన దివ్యమైన నాగమణి కారణంగా తలలో మణి పెరగడం మొదలైంది. తలనుండి పగడపు కాంతులు రావడం మొదలైంది. కన్యలకు రజస్వలా సమయంలో ఆ పరిమళం సోకినా, ఈ మణికాంతులు కనిపించినా క్రమంగా సమ్మోహితులు అవుతారు. వశులవుతారు. ఆ కామకేళిలో తట్టుకోలేక ప్రాణాలు కోల్పోతారు'

' పోయిన నాగులపంచమినాడు సంపంగి కుతూహలాన్ని ఆపుకోలేకపోయింది. అందరినీ పంపించి, నాగుమయ్య ఒక్కడూ పాండవుల గుట్టమీద ఏం చేస్తాడో కనిపెడదాము అనుకున్నది! రజస్వలగా వుండికూడా చెట్టెక్కి చాటుగా అంతా చూసింది. నా అన్న.. పాములా పాకుతూవచ్చి.. నామీద నిస్సహాయంగా బుసలు కొడుతూ.. గుండిగలో ఆవుపాలు తాగడం చూసింది.. ఆ మదపువాసన, ఆ మణికాంతులు ఆమెను లొంగదీసుకున్నాయి!

ఆ పొందుకోసం వెర్రెత్తిపోయింది! ఇక ఆగలేక పాండవులగుట్ట మీదకు పరుగుపెట్టింది. బిలంలోకి కాలుపెట్టింది. నా అన్న తన తలమీదకెక్కించుకుని ప్రేమగా తీసుకెళ్దామనుకున్నాడు '

నమ్మలేనట్టుగా వింటున్నాడు శివయ్య. ఊడి బయటకు వస్తాయేమో అన్నంతగా గుడ్లువెళ్ళబెట్టుకుని, నోరుతెరిచి

వింటున్నాడు. సన్నగా వణుకుతూన్న గొంతుతో ' ఆ చనిపోయిన పెద్ద సర్పం..' అని మధ్యలో ఆగిపోయాడు. 'అన్నయ్య కాదు! అది ఆడత్రాచు! ఆ బిలంలో తనను పెనవేసుకుని వుంటుంది' నిర్లిప్తంగా చెప్పాడు నాగుమయ్య. భయంతోనో, కంపరంతోనో కీచుగా అరిచాడు శివయ్య. ' పెదబాబు..' అని ఏమనాలో తెలియనట్టు, ఏదో అడగబోయి ఆగిపోయాడు.

' పెద్ద బాబు కాదు, పెద్ద పాము!' అంటూ విరక్తిగా నవ్వాడు నాగుమయ్య. ' ఇక బిలంనుండి బయటకు రాలేదు. పడగశిల దిగబడి బిలం మూసుకుపోయింది. అందులోనే వుంటాడు.. ఎన్నాళ్ళో..యెన్నేళ్ళో..' అంటూ బాధగా నుదురు పట్టుకున్నాడు నాగుమయ్య. నాగుమయ్య చెంపలమీదుగా జారి, అందమైన గడ్డపు నొక్కును నింపి, విశాలమైన ఛాతీమీదకు చేరి, అక్కడ యింకిపోయాయి అరుదైన కన్నీటిబొట్లు.

★★★★★★★★★★★

ఆ కంఠస్వరం ఎక్కడో విన్నదానిలా పదే పదే ప్రతిధ్వనిస్తున్నది. ఆ ముఖం, ఆ ఆకారం అలలకు నీటిమీద చెదిరిపోతున్న ప్రతిబింబంలా తునాతునకలు అవుతున్నది. క్రమేపీ దూరంగా..దూరంగా వినిపిస్తూ పోతున్నది ఆ గొంతు! మంచు పరదాలమాటున మాయమైనట్లు మసక మసకగా ఆ రూపం వూయలలూగుతున్నట్లుగా కరిగిపోయింది.

అంతకంతకూ అస్పష్టంగా చెదిరిపోతున్న ఆ ఆకారం స్థానంలో క్రమక్రమంగా దూరంనుండి దగ్గరవుతున్నట్లు స్పష్టంగా కనిపించసాగింది మరొక రూపం. అదే ముఖంలా ఉన్నది. అవే పోలికలు! గడ్డం మీద ముద్దుగా అదే అందమైన నొక్కు! అవే ఉంగరాల ముంగురులు తల వూపుతున్నప్పుడు చెంపలమీద నాట్యమాడుతున్నాయి. కానీ, అడ్డంగా రెండు కనుబొమలనూ కలిపి, నిలువుగా నుదురును దాటి పైకి వెళ్లి, మాయమైన అందమైన ఊర్ధ్వపుండ్రాలు! ఒక చేతిలో తంబుర చెవులకు తేనెలు పంచుతున్నది. మరొక చేతిలో చిడతలు మధురంగా మోగుతున్నాయి.

ఆ కంఠం మధురంగా ధ్వనిస్తున్నది..' దేవా! పెద్ద తనంబు చేసి మిమ్ము మెప్పించెద నంటినా, జాంబవంతుడు మీ సన్నిధినే యున్నాడే, దేవా..' స్పష్టంగా చూస్తున్నాడు కృష్ణరాయలు! చెవులకు స్పష్టంగా వినబడుతున్నది అదే గొంతు! ఆహార్యం మార్చిన నటుడిలా ఉన్నాడు. పలుకులను మార్చిన వక్తలా ఉన్నాడు. కొత్తగా మొదలైన పాతకథలా వున్నది. కృష్ణరాయలు చూస్తున్నాడు, వింటున్నాడు, తెలుసుకుంటున్నాడు. కృష్ణమ్మ గలగలలతో కథకు 'ఊ' కొడుతున్నట్లున్నది. భవానీ ద్వీపం మౌనసాక్షిలా గమనిస్తున్నది.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS